టీ-మీడియా

Digital, tmedia.net.in

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

11వ వార్షికోత్సవం 2016 - 2026

మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం 13/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

సుప్రీంకోర్టుకు ఇండీ కూటమి నేతల భారీ ర్యాలీ

పిటిషన్ దాఖలు చేసిన రాహుల్‌గాంధీ



టి మీడియా , అక్టోబర్ 12 , ఢిల్లీ బ్యూరో : సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ విపక్ష ఇండియా కూటమి దిల్లీలో చేపట్టిన 'చలో దిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ తదితర

➤ మిగతా 2వ పేజీలో..

ముగిసిన జంతర్ మంతర్ శకం

చారిత్రక పోరాటాలకు సజీవ సాక్ష్యం

టి మీడియా , అక్టోబర్ 12 , ఢిల్లీ బ్యూరో : ఒకప్పుడు ఆకాశంలోని గ్రహాల గమనాన్ని, కాలాన్ని లెక్కించడానికి కట్టిన చరిత్రాత్మక కట్టడం అది. కానీ కాలక్రమేణా ప్రజల బాధలు, సమస్యలను పాలకులకు వినిపించే శక్తిమంతమైన నిరసనల వేదికగా మారిపోయింది. అదే దేశ రాజధానిలోని జంతర్ మంతర్. ప్రభుత్వంపై తమకున్న అసంతృప్తిని లేదా డిమాండ్లను దేశవ్యాప్తంగా చాటిచెప్పాలనుకునే కోట్లాది మంది ప్రజల ఆశల చిరునామా ఇది. గడిచిన కొన్ని దశాబ్దాలుగా భారత ప్రజాస్వామ్య చరిత్రలో జరిగిన ఎన్నో చరిత్రాత్మక నిరసనలకు ఈ ప్రాంగణమే సజీవ సాక్ష్యంగా నిలిచింది.దేశవ్యాప్తంగా అవినీతికి వ్యతిరేకంగా ఒక విప్లవమే సృష్టించిన అన్నా హజారే నిరాహార దీక్షల నుంచి దేశాన్ని కుదిపేసిన నిర్భయ ఉదంతంపై యావత్ భారతావని గర్జించిన ఆందోళనల వరకు- ఇటీవల నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో విద్యార్థుల ఉద్యమాల వరకు ఎన్నో ప్రజా నిరసనలను, ప్రజాస్వామ్య గొంతుకలను ఈ వేదిక దగ్గరుండి చూసింది. అలా ఏళ్లుగా ప్రజాస్వామ్య పోరాటాలు, చారిత్రక ఉద్యమాలు, సామాన్యుల గొంతుకకు కేంద్రంగా నిలిచిన ప్రముఖ నిరసన వేదిక జంతర్ మంతర్ శకం ముగిసిపోయింది. దిల్లీలో శాంతియుత నిరసనల స్వరూపాన్నే





పూర్తిగా మార్చేస్తూ, జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశం హోదా నుంచి పూర్తిగా రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.

నిరసన వేదికగా ఎలా మారింది?

స్వాతంత్ర్యానంతరం దశాబ్దాల పాటు దిల్లీలో రాజకీయ ర్యాలీలు, నిరసనలకు ఇండియా గేట్ సమీపంలోని 'బోట్ క్లబ్' లాన్‌లే ప్రధాన వేదికలుగా ఉండేవి. పార్లమెంట్ భవనం, ప్రభుత్వ అత్యున్నత కార్యాలయాలకు అతి సమీపంలో ఉండటంతో ఇక్కడ అప్పట్లో ఆందోళనలు ఉద్ధృతంగా జరిగేవి. అయితే 1988లో రైతు నేత మహేంద్ర సింగ్ టికాయత్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జరిగిన రైతు ఆందోళనలతో దిల్లీ నడిబొడ్డున ట్రాఫిక్ నిలిచిపోవడం, భద్రతా సమస్యలు తలెత్తడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. 1990ల ప్రారంభంలో రాజ్‌పథ్ (నేటి కర్తవ్యపథ్) పరిసరాల్లో నిరసనల కోసం వేసిన టెంట్లను ప్రభుత్వం తొలగించింది. ఇక్కడ కూడా నిరసనలు పూర్తిగా నిషేధించారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాన్ని వెతుక్కున్న ఆందోళనకారులు క్రమంగా కన్నాట్ ప్లేస్ సమీపంలోని జంతర్

➤ మిగతా 2వ పేజీలో..

ఈవీ కారులో చెలరేగిన మంటలు

నలుగురు సజీవదహనం



టి మీడియా , అక్టోబర్ 12 , విజయవాడ: విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈవీ కారులో మంటలు చెలరేగి నలుగురు సజీవదహనమయ్యారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాందేవ్ (39), ఆయన తల్లి కొమ్మారెడ్డి అరుణ, ఓ చిన్నారి, నంబూరుకు చెందిన తిగురు విజయగా గుర్తించారు. తీవ్ర గాయాలతో ఉన్న ఒకరిని ఆసుపత్రికి తరలించారు. నంబూరులోని ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుల బంధువులు

➤ మిగతా 2వ పేజీలో..

కనకదుర్గమ్మను దర్శించుకోనున్న రాష్ట్రపతి ముర్ము

మహిళలు, లఖ్‌పతి దీదీలతో విందు

టి మీడియా , అక్టోబర్ 12 , విజయవాడ: : విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో మహాచండీ దేవి అలంకరణ రోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఈ నెల 14వ తేదీన రాత్రి 7 గంటల 20 నిమిషాలకు ముర్ము ఆలయానికి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను ఆలయ అధికారులు పకడ్బందీగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా కమిషనర్ రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో చీఫ్ ఫెస్టివల్ అధికారి త్రినాధరావు పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈఓ శీనానాయక్ పండితులతో సమావేశమయ్యారు. డీసీపీ కేజీవీ సరిత పర్యవేక్షణలో రాష్ట్రపతి పర్యటన సన్నాహాలపై ట్రయల్ రన్ నిర్వహించారు.



ప్రోటోకాల్ తప్పకుండా పాటించాలి

రాష్ట్రపతి ముర్ము పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, నిమిషాల వారీగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పర్యటన ఏర్పాట్లపై

➤ మిగతా 2వ పేజీలో..



ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బీఆర్ఎస్ వ్యూహాలు

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

టి మీడియా , అక్టోబర్ 12 , హైదరాబాద్ బ్యూరో : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను రెండేళ్లలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సెమీ ఫైనల్స్?గా భావిస్తున్న గులాబీ పార్టీ రెండు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకొంది. ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, బాధ్యుల్ని నియమించాలని నేతలకు ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ కసరత్తు ఆశించిన మేర సాగడం లేదన్న అభిప్రాయంతో ఉన్న పార్టీ నాయకత్వం,

➤ మిగతా 2వ పేజీలో..

'కొత్త ఫారం-6ను సుప్రీంకోర్టు ఆమోదించలేదు'

- ఈసీ ప్రకటనపై సీజేఐ ఆగ్రహం



టి మీడియా , అక్టోబర్ 12 , ఢిల్లీ బ్యూరో : బిహార్? ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్?ఐఆర్?)కు అంశంలో కొత్త ఫామ్?-6పై ఎలాంటి తీర్పు ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తీర్పు వెలువరించినప్పుడు కొత్త ఫారం-6 అంశమే లేదని తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఫామ్-6లో చేసిన మార్పులను అత్యున్నత న్యాయస్థానం ఆమోదించిందన్న ఈసీ చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామని పేర్కొంది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్? జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం సోమవారం బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించిన పిటిషన్‌పై

➤ మిగతా 2వ పేజీలో..

GSTIN:36FDKPS1308P1ZX

టి-మీడియా

MEDIA

సామాజికం ... ప్రజల పక్షం...

epaper,www.tmedia.net.in YouTube facebook

టీ మీడియా సేవలు (A TO Z)

టీ మీడియా (డిజిటల్) ద్వారా తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు వివిధ భాషల్లో మీడియా సేవలు అందుబాటులో ఉన్నాయి.

ప్రధాన సేవలు

- ప్రెస్ మీట్, ప్రెస్ నోట్, ప్రసంగాల రూపకల్పన
- ప్రత్యేక వార్తా కథనాల రచన, ఎడిటింగ్
- PRGI, డిజిటల్ మీడియా రిజిస్ట్రేషన్‌పై కన్సల్టెన్సీ
- ప్రెంట్, ఆన్‌లైన్ ప్రత్యేక సంచికల రూపకల్పన
- వార్తలు, వీడియోలతో మీడియా కవరేజ్
- వీడియోలను టెక్స్ట్‌గా మార్చడం
- న్యూస్ వెబ్‌సైట్, ఈ-పేపర్ ఏర్పాటు, నిర్వహణ
- వెబ్‌సైట్ కంటెంట్, వార్తలు, ఫోటోలు, వీడియోల అప్‌లోడింగ్



సంప్రదించండి

8919710365 | 7382990365 | 8500459365

గమనిక: ఉచిత సేవలు లేవు. కన్సల్టెన్సీ ఫీజుతో పాటు సేవను బట్టి అదనపు రుసుములు వర్తిస్తాయి. అన్ని సేవలు ప్రభుత్వ నిబంధనల మేరకు ఉంటాయి. ప్రభుత్వ అనుమతుల విషయంలో గ్యారంటీ, వారంటీ లేవు. మాది కేవలం ప్రాసెసింగ్ సర్వీస్ మాత్రమే.

సుప్రీంకోర్టుకు ఇండీ కూటమి నేతల భారీ ర్యాలీ

అగ్రనేతల నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ నుంచి సుప్రీంకోర్టు వైపు సాగిన ఈ నిరసన ప్రదర్శనను భగవాన్ దాస్ రోడ్డు వద్ద పోలీసులు భారీ బారికేడ్లతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ ఏకంగా బారికేడ్ల పైకెక్కి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, దిల్లీ పోలీసులు కుమ్మక్కై యువతను అణచివేస్తున్నారని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులు, మహిళలపై ఉద్దేశపూర్వకంగానే దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.మరోవైపు, సీజేఐ సూచన మేరకు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అధికారికంగా నమోదైంది. విపక్ష నేతలను నేరుగా కలిసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. ఈ వ్యవహారం ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, అధికారికంగా పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. అంతకుముందు కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన నేతలు బస్సులో కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్? బయలుదేరారు. విపక్షాల నిరసనల దృష్ట్యా దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ర్యాలీ సాగే మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బారాఖంబా జంక్షన్ నుంచి మండి హౌస్ వరకు భద్రతా బలగాలను భారీగా మోహరించి, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

'కొత్త ఫారం-6ను సుప్రీంకోర్టు ఆమోదించలేదు'

విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్? తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఫామ్?-6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, కొత్త ఫామ్-6పై ఎలాంటి న్యాయ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. బిహార్ ఎస్ఐఆర్ వ్యవహారంపై గతంలో విచారణ జరిపినప్పుడు కొత్త ఫామ్-6 అంశం తమ ముందుకు రాలేదని ఆయన పేర్కొన్నారు.

బిహార్? ఎస్?ఐఆర్? అంశంలో మేలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఆ తీర్పులో ఫామ్?-6ను ఎస్?ఐఆర్? ధ్రువీకరణ ప్రక్రియకు మార్గదర్శకంగా పేర్కొంది. అప్పట్లో బిహార్?లో ఉపయోగించిన ఫామ్?-6 పత్రాల పరిశీలనకు ఒక విధానాన్ని నిర్దేశిస్తోందని వివరించింది. ధ్రువీకరణ ప్రక్రియకు ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా పూర్తిగా అధికారుల వ్యక్తిగత నిర్ణయాలపై వదిలేయడం ఆచరణ సాధ్యం కాదని, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం రూపొందించిన ఫామ్-6, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(2) కింద చేపట్టే ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియకు అనుగుణంగా ఉండాలని ఆ తీర్పులో పేర్కొన్నారు.

ఎన్నికల సంఘం ప్రకటనపై చర్చ

2026 సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం ఒక ప్రకటనను విడుదల చేసింది. అందులో బిహార్? ఎస్?ఐఆర్?కు సంబంధించి 2026 మేలో ఇచ్చిన తీర్పులో ఫామ్?-6లోని ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు పేర్కొంది. దాని ప్రకారం, కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తులు గతంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలతో తమకు ఉన్న సంబంధాన్ని వివరించే అదనపు డిక్లరేషన్?ను సమర్పించాల్సి వచ్చింది. దరఖాస్తుదారులు తాము, తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతలు గత ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాల్లో నమోదై ఉన్నారా? అనే వివరాలు వెల్లడించాలి. ఈ వివరాల ద్వారా పాత ఓటర్ల జాబితాలతో అనుసంధానాన్ని గుర్తించే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం తప్పనిసరి చేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేయకుండా ఫామ్-6 దరఖాస్తులను సమర్పించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ మార్పులపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

కనకదుర్గమ్మను దర్శించుకోనున్న రాష్ట్రపతి ముర్ము

వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎస్ పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్న రాష్ట్రపతి రాత్రి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు.15న పున్నమి ఘాట్‌లో నిర్వహించే సరస్ మేళాలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలు, లక్ష్‌పతి దీదీలతో కలిసి విందులో పాల్గొని మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం నుంచి దిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సాయిప్రసాద్ ఆదేశించారు.తెల్లవారుజామునుంచే భారీగా భక్తుల తాకిడి : ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునుంచే భక్తుల తాకిడి భారీగా ఉంది. క్యూలో నిల్చున్న భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుంటున్నారు. గాయత్రీ దేవిని పంచముఖాలు కలిగిన రూపంలో పూజిస్తారు. ఆ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలూ కలుగుతాయని పండితులు తెలిపారు.

ఈవీ కారులో చెలరేగిన మంటలు

ఘటనాస్థలికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు.

మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి

ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "విజయవాడ వెస్ట్ బైపాస్?లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు చనిపోవడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను." అని మంత్రి లోకేశ్? అన్నారు.

ముగిసిన జంతర్ మంతర్ శకం

మంతర్ ప్రాంతంవైపు మళ్లారు. అప్పటినుంచి అంటే 1993 నాటికి ఇదే దేశ రాజధానిలో ప్రధాన నిరసన కేంద్రంగా అవతరించింది.

చారిత్రక పోరాటాలకు వేదిక

18వ శతాబ్దంలో ఖగోళ వస్తువులను, వింతలను, గ్రహాలు, కాల గమనాన్ని పరిశీలించడం కోసం మహారాజా సవాయ్ జైసింగ్ ×× నిర్మించిన ఈ ఎత్తైన రాతి కట్టడాల ప్రదేశమే జంతర్ మంతర్. ఈ చారిత్రక ప్రదేశం కాలక్రమేణా పాలకులపై ప్రజలకున్న వ్యతిరేకతను వ్యక్తపరిచే వేదికగా మారింది. ఇక్కడే ఎన్నో చారిత్రక ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. అవినీతి నుంచి మహిళల భద్రత వరకు, రైతుల సమస్యల నుంచి పరీక్షల నిర్వహణలో అక్రమాల ఆరోపణల వరకు ఎన్నో అంశాలపై ప్రజలు ఇక్కడే గళమెత్తారు. ఇక్కడికి వచ్చిన జనసమూహాలే కాకుండా, వారు లేవనెత్తిన సమస్యలు, అధికారులను జవాబుదారీగా నిలబెట్టాలన్న డిమాండ్లు కూడా ఈ ప్రదేశానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ఇక జంతర్ మంతర్ వేదికగా నిర్వహించిన వాటిల్లో ప్రజల దృష్టిని ఆకర్షించిన, చర్చనీయాంశంగా మారిన నిరసనలు, ఆందోళనలు, దీక్షల గురించి ఇప్పుడు చూద్దాం.1993 జైల్ భరో ఆందోళన- జంతర్ మంతర్ వద్ద జరిగిన ముఖ్యమైన మొట్టమొదటి నిరసనల్లో 1993లో నిర్వహించిన ఈ జైల్ భరో కార్యక్రమం ఒకటి. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, మతతత్వానికి వ్యతిరేకంగా 33 సంస్థలు కలిసి సుమారు 25 వేల మందితో ఇక్కడ భారీ ఆందోళన నిర్వహించాయి. పార్లమెంటులోనూ దీని గురించి చర్చ జరిగింది.2011 అన్నా హజారే ఉద్యమం- ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే 2011లో చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంతో జంతర్ మంతర్ పేరు మరింత మార్మోగిపోయింది. జన్‌లోక్‌పాల్ బిల్లు కోసం ఆయన చేపట్టిన 5 రోజుల నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఉద్యమమే జంతర్ మంతర్‌ను తర్వాతి రోజుల్లో జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద నిరసనలకు కేరాఫ్‌గా మార్చింది.2012 నిర్భయ ఘటన- 2012లో దిల్లీలో కదులుతున్న బస్సులో ఓ యువతిపై సామూహిక అత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. దేశాన్ని కుదిపేసిన ఈ నిర్భయ ఘటనపై న్యాయం కోరుతూ వేలాదిగా యువతీయువకులు ఇక్కడే రోడ్డెక్కి తమ గళం వినిపించారు.2015 ూ=ూూ ఆందోళన- మాజీ సైనికాధికారులు వన్ ర్యాంక్ వన్ పెన్షన్ కోసం ఇక్కడ నెలల తరబడి దీక్షలు చేపట్టారు.2017 తమిళనాడు రైతుల నిరసన- కరువు కారణంగా పంట నష్టాలకు సహాయం, రుణ మాఫీ కోసం తమిళనాడు రైతులు పుర్రెలు పట్టుకొని దాదాపు 41 రోజుల పాటు జంతర్ మంతర్ కేంద్రంగా చేసిన వినూత్న నిరసన దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.2019 జూూూ వ్యతిరేక ఆందోళనలు- పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2019 డిసెంబరులో ఇక్కడ వామపక్షాలు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు.2021 రైతు కిసాన్ సంసద్- రైతు ఉద్యమ చరిత్రలో జంతర్ మంతర్ వేదికగా జరిగిన కిసాన్ సంసద్ (రైతు పార్లమెంట్) ఒక వినూత్న ఘట్టంగా నిలిచింది. 2021 జులై 22 నుంచి ఆగస్ట్ 9 వరకు రోజుకు 200 మంది రైతులతో ఇక్కడ శాంతియుత నిరసనలు చేపట్టేందుకు కోర్టు, పోలీసుల అనుమతి లభించింది.

2023 రెజ్లర్ల ఆందోళన- ప్రముఖ రెజ్లర్లు, ఒలింపిక్ పతక విజేతలు సహా పలువురు క్రీడాకారులు లైంగిక వేధింపుల ఆరోపణలపై నాటి డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఇక్కడే కూర్చొని నిరసన తెలిపారు.2026 నీట్- రాజకీయ ఆందోళనలు- నీట్ పేపర్ లీక్ ఆరోపణలతో ప్రధాన ప్రతిపక్షాలు సహా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలతో జంతర్ మంతర్ పేరు దేశవ్యాప్తంగా మరోసారి మార్మోగిపోయింది.

జంతర్ మంతర్‌ను ఇప్పుడు ఎందుకు తొలగించాల్సి వచ్చింది?

గతంలోనే శబ్ద కాలుష్యం, పారిశుద్ధ్య సమస్యలు, స్థానికులకు ఇబ్బందుల కారణంగా నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ 2017లో ఇక్కడ నిరసనలను నిషేధించింది. దీనిపై సుప్రీంకోర్టు 2018లో చారిత్రక తీర్పునిస్తూ- శాంతియుతంగా నిరసన తెలపడం ప్రాథమిక హక్కే అయినప్పటికీ, ప్రజాభద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు సముచితంగా ఉండేలా ఆంక్షలు విధించొచ్చని స్పష్టం చేసింది. అయితే ఇటీవల అక్టోబర్ 10-11 తేదీల్లో జరిగిన ఉద్రిక్త ఆందోళనల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సిఫార్సుల మేరకు దిల్లీ ప్రభుత్వం అక్టోబర్ 12 నుంచి జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశం హోదా నుంచి పూర్తిగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దిల్లీలో నిరసనలకు ప్రత్యామ్నాయ స్థలం చూడాలని సుప్రీం కోర్టు సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రత్యామ్నాయ వేదికలు ఇవే

అయితే ప్రజల భావప్రకటనా స్వేచ్ఛకు, నిరసన తెలిపే ప్రాథమిక హక్కుకు భంగం కలగకుండా ప్రభుత్వం మరో 3 కొత్త ప్రదేశాలను అధికారిక నిరసన వేదికలుగా ఖరారు చేసింది. వీటిల్లో రామ్‌లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్- ఈస్ట్ దిల్లీ వంటివి ఉన్నాయి. అయితే దశాబ్దాలుగా సామాన్యుల గొంతుకగా మారిన జంతర్ మంతర్- ఇప్పుడు నిరసన ప్రదేశంగా దాని అధికారిక హోదా కోల్పోవడంతో, ప్రజలు తమ గొంతును వినిపించేందుకు ఉన్న వేదికల భవిష్యత్తుపై చర్చ మొదలైంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

వేగవంతం చేయాలని సదరు నేతలకు సూచించింది. ఈ మేరకు ఇక నుంచి 3 రోజులకోసారి సమీక్ష నిర్వహించాలని కేటీఆర్ భావిస్తున్నారు.

నాయకులకు కేటీఆర్ దిశానిర్దేశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెబుతున్న గులాబీ పార్టీ, ఆ అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబిస్తుందని ఆశిస్తోంది. రెండేళ్లలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావిస్తున్న బీఆర్ఎస్ నాయకత్వం, రెండు స్థానాల్లోనూ విజయం సాధించడమే లక్ష్యంగా కార్యాచరణను రూపొందిస్తోంది. ఎన్నికల ఫలితాలను భవిష్యత్ రాజకీయాలకు అనుకూల సంకేతంగా మలచుకోవాలని భావిస్తోంది. 6 ఉమ్మడి జిల్లాల పరిధిలో జరగనున్న ఈ ఎన్నికలపై పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇప్పటికే నాయకులకు దిశానిర్దేశం చేశారు.

వ్యక్తిగత నాయకత్వంపై ఆధారపడొద్దని హితవు

రెండు స్థానాల్లోనూ బీఆర్?ఎస్ గెలిచే అవకాశాలున్నాయని నేతలతో కేటీఆర్? చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత నాయకత్వ బలంపై ఆధారపడకుండా పార్టీ యంత్రాంగం ద్వారా ఎన్నికలకు సమాయత్తం కావాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్లు సమాచారం. ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికకు తొందరపడకుండా ముందుగా ఓటర్ల నమోదును పూర్తి చేయడంపైనే దృష్టి సారిస్తోంది. అనంతరం స్థానిక రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల బలాబలాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది.

ముందు ఓటర్ల నమోదుపైనే దృష్టి

అభ్యర్థుల ఎంపిక కంటే ముందుగా ఓటర్ల నమోదు ప్రక్రియపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని కేటీఆర్? స్పష్టం చేశారు. ఓటర్ల నమోదులో మొదటి నుంచే క్రియాశీలంగా పనిచేస్తేనే ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించగలమని పార్టీ నేతలకు వివరించారు. ప్రతి వంద మంది ఓటర్లకు ఒకరు చొప్పున బాధ్యులను నియమించాలని ఆయన ఆదేశించారు. ఓటర్ల నమోదుతో మొదలుకొని పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రతి దశను పర్యవేక్షించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, నిరుద్యోగులు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఈ వర్గాల నుంచి మద్దతు లభిస్తుందన్న ఆశాభావంతో ఉన్న పార్టీ, నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేస్తోంది.

పలువురు నేతల తీరుతో అసంతృప్తి

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో కొందరు నేతలు ఆశించిన స్థాయిలో పని చేయడం లేదన్న అసంతృప్తి పార్టీ నాయకత్వంలో వ్యక్తమవుతోంది. ఇటీవల నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 మంది ఓటర్లకు ఒకరు చొప్పున బాధ్యులను నియమించే ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని ఆయన దృష్టికి వచ్చింది. ముఖ్యంగా మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు, బాధ్యుల నియామకంపై మరింత వేగం పెంచాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు.

3 రోజులకోసారి కేటీఆర్ రివ్యూ

ముఖ్యంగా నేతలు, వారి కుటుంబ సభ్యులు ముందుగా పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకునే ప్రక్రియ వేగవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు నమోదు ప్రక్రియను పూర్తి చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం ద్వారా ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల నమోదును సాధారణ కార్యక్రమంగా కాకుండా, ఎన్నికల విజయానికి పునాదిగా పరిగణించాలని చెప్పారు. ఇకపై ప్రతి 3 రోజులకోసారి పురోగతిని సమీక్షిస్తానని నేతలకు స్పష్టం చేశారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

హైదరాబాద్, అక్టోబర్ 12 తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మహిళా నాయకులతో కలిసి బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఈ కార్యక్రమంతో కార్యాలయంలో పండుగ సందడి నెలకొంది. అనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళా నాయకులతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ ప్రజల జీవన విధానంలో బతుకమ్మకు ఉన్న ప్రత్యేక స్థానం, మహిళలను ఐక్యంగా నిలిపే ఈ పండుగ విశిష్టతను ఆమె వివరించారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషించిందని కవిత గుర్తుచేశారు. పండుగ ద్వారా మహిళలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి అప్పట్లో విస్తృతంగా కృషి చేసినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప వేడుక బతుకమ్మ అని పేర్కొన్నారు. ప్రపంచంలో మరెక్కడా లేని ప్రత్యేకత ఈ పండుగకు ఉందని, తెలంగాణ ప్రజలందరూ సంప్రదాయబద్ధంగా బతుకమ్మను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ పాటలను నేర్చుకుని, వాటిని భావితరాలకు అందించాలని సూచించారు. గౌరమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ ఆడబిడ్డలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.మహిళలు, బహుజనుల అభ్యున్నతి కోసం తాను కృషి చేస్తున్నానని, తనకు రాష్ట్ర ప్రజల ఆశీర్వాదం కావాలని కవిత విజ్ఞప్తి చేశారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం, రాజకీయాల్లో మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించడం తన లక్ష్యమని తెలిపారు. మహిళలకు అవకాశాలు కల్పించడంలో మాటలకు మాత్రమే పరిమితం కాకుండా ఆచరణలో చూపిస్తామని పేర్కొన్నారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే వారి సమస్యలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళలు, బహుజనుల హక్కులు, అభివృద్ధి కోసం తమ పార్టీ పనిచేస్తుందని వెల్లడించారు. రిజర్వేషన్లు అమలులో ఉన్నా లేకున్నా తమ పార్టీ తరఫున మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తామని కవిత ప్రకటించారు. మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో ఇతర పార్టీల నిర్ణయాలతో సంబంధం లేకుండా తమ విధానాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి ప్రజాసేవలోకి వచ్చే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన తర్వాత తమ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. మహిళల భాగస్వామ్యంతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశాన్ని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, దాని విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా చాటాలని కవిత పిలుపునిచ్చారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

•జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



టి మీడియా , అక్టోబర్ 12 , ఖమ్మం:ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కే. జాన్ బీ తన సదరం సర్టిఫికెట్‌లో తప్పుడు వివరాల కారణంగా దివ్యాంగుల పింఛన్ నిలిచిపోయిందని, తిరిగి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.పీడీఎస్‌యూ అధ్యక్షుడు టి. లక్ష్మణ్ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న వేదాంత లెర్నింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.ఏదులాపురం పట్టణానికి చెందిన ఎస్.కే. ఆఫ్సానా తాను ఎంబీఏ పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలపై పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి అధికారికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రవిచంద్రను హత్య చేసిన వారిని అరెస్ట్ చేయాలి

•-సిపిఎండిమాండ్‌లి



టి మీడియా , అక్టోబర్ 12 , కరకగూడెం: మండలంలోని కలవలనాగారం గ్రామానికి చెందిన బాదావత్ రవిచంద్ర ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొమరం కాంతారావు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని హత్యకు పాల్పడిన వారు ఎవరైనా సరే విచారణ నిష్పక్షపాతంగా జరిపి ఘటనకు కారకులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు చర్ప సత్యం పాల్గొన్నారు

రైల్వే పనుల ముసుగులో ఇసుక డంపులు

•అక్రమ నిల్వలపై అనుమానాలు



టి మీడియా , అక్టోబర్ 12 , మాగనూరు : రైల్వే పనుల కోసం ఇసుకను నిల్వ చేస్తున్నామనే పేరుతో భారీగా ఇసుక డంపులుఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు మాగనూరు మండల పరిధిలో చర్చనీయాంశంగా మారాయి. రైల్వే పనులకు అవసరమైన ఇసుక నిల్వల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను డంప్ చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.రైల్వే పనుల కోసం ఇసుకను నిల్వ చేయడం తప్పు కాకపోయినా, అందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఇసుక ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? రవాణాకు సంబంధించి అనుమతి పత్రాలు ఉన్నాయా? నిల్వలు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు. ఇసుక డంపుల వ్యవహారంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఎలాంటి అనుమతులు తీసుకోలేదు : తహసీల్దార్

రైల్వే పనుల నిమిత్తం ఇసుకకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తహసీల్దార్ రెహమాన్ వెల్లడించారు. పెద్ద మొత్తంలో వేసిన ఇసుక డంపులను పరిశీలించడానికి ఆర్ఐ సుధాకర్, సిబ్బందిని పంపించానని అక్రమంగా ఇసుక డంపులు వేసినట్లయితే ఇసుక డంపులు సీజ్ చేస్తామన్నారు. రాత్రివేళలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వం దసరా గిఫ్ట్



• మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ ధరలు తగ్గింపు..!

టి మీడియా , అక్టోబర్ 12 , హైదరాబాద్ బ్యూరో : హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు ఇటీవల మెట్రో–ఆర్టీసీ సేవలకు కామన్ మొబిలిటీ పాస్‌ను తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చింది. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజున ఈ పాస్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విడుదల చేశారు. ఈ పాస్ ద్వారా హైదరాబాద్ పరిధిలో తిరిగే ఆర్టీసీ బస్సులతో పాటు మెట్రోలలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. ఈ పాస్ ఉంటే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో ఎన్నిసార్లు అయినా ప్రయాణించవచ్చు. మెట్రో, ఆర్టీసీ కలిపి ఈ కామన్ పాస్‌ను రూపొందించాయి. దీని వల్ల ప్రతీసారి మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు టికెట్ తీసుకోవాల్సిన అవసరముండదు. ఈ కామన్ పాస్ ఉపయోగించడం వల్ల జస్ట్ ఒక్క స్కాన్‌తో ప్రయాణం చేయవచ్చు. దీని వల్ల సమయం ఆదా అవ్వడంతో పాటు ప్రయాణం వేగవంతమవుతుంది.

టికెట్ల కోసం నో వెయిటింగ్..

టికెట్ల తీసుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్ కోసం వెయిట్ చేయాల్సిన పని ఉండదు. అలాగే మెట్రో స్టేషన్లలో కౌంటర్ల దగ్గర క్యూలైన్లలో నిల్చోవాల్సిన అసవరం ఉండదు. ఈ కామన్ పాస్ ఉంటే నేరుగా ఎంట్రీ గేట్ల దగ్గర స్కాన్ చేసి మెట్రోలలో ప్రయాణించవచ్చు. ఇక బస్సుల్లో ప్రతీసారి టికెట్ తీసుకోవాల్సిన పని ఉండదు. కామన్ పాస్ వల్ల టికెట్ కష్టాలు తొలగిపోగా. దీని ధరలు అధికంగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్ ధర రూ.400గా ప్రభుత్వం ఫిక్స్ చేసింది. ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100 ఉంది. ఇక నెలవారీ పాస్ ధర రూ.8,500గా ఉండగా.. ఇందులో మెట్రో వాటా రూ.7 వేలు, ఆర్టీసీ వాటా రూ.1500గా ఉంది. అధిక ధరలు ఉండటం వల్ల ఈ పాస్‌లకు ఆదరణ తగ్గింది. ఎక్కువమంది ప్రయాణికులు వీటివైపు కూడా చూడటం లేదు. దీంతో కామన్ పాస్ ధరలపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి



• మండల ప్రజావాణిని తనిఖీ చేసిన కలెక్టర్

టి మీడియా , అక్టోబర్ 12 , దమ్మపేట :ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రజావాణికి హాజరైన వివిధ శాఖల అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు.అనంతరం మండలంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం తో తాగునీటి సరఫరా, చెరువుల నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులను తాగునీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇరిగేషన్ అధికారుల ద్వారా మండలంలోని 230 చెరువుల నీటి నిల్వల వివరాలను తెలుసుకున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నీటి నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులను రైతు వేదికల్లో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాలకు హాజరవుతున్న రైతుల సంఖ్య, వారికి అందిస్తున్న సలహాలపై ఆరా తీశారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు.అటవీశాఖ అధికారులను ఫారెస్ట్--రెవెన్యూ సంయుక్త సర్వేలు, భూ రీసర్వే పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంయుక్త సర్వేలను నిర్దేశిత విధానాల ప్రకారం చేపట్టాలని, సర్వేలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.మండల ప్రజావాణికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరవుతున్న అంశంపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి వారం ఎంతమంది దరఖాస్తుదారులు వస్తున్నారు, మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి ఎందుకు వస్తున్నారు అనే వివరాలను ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు.మండల ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, యువత సహకారంతో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను మండల స్థాయిలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని, ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు .ఈ పరిశీలనలో దమ్మపేట తాసిల్దార్ మురళి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంపు ఆన్ చేయకపోతే కార్యాచరణకు సిద్ధం



సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

టి మీడియా , అక్టోబర్ 12 , మహబూబ్‌నగర్ : నార్లపూర్ రిజర్వాయర్, పంపు హౌస్ సిద్ధంగా ఉన్నా నాయకుల నిర్లక్ష్యధోరణితో నీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులకు వేలాది కోట్ల పంట నష్టం జరుగుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి (ాఅఅస్త్రఅతీవఎఎఎ చీఅతీఖఅయిఅ =వఎఎఎ) ఆగ్రహం వ్యక్తం చేశారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగ మైన నార్లపూర్ రిజర్వాయర్‌ను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ 24గంటల కరెంట్ ఇస్తే పంపులు ప్రారంభిస్తామని అధికారులు నివేదికలు ఇచ్చినా, జిల్లా మంత్రులు పెడచెవిన పెట్టి రైతులను ఆగం చేస్తున్నారని ధ్వజం ఎత్తారు.మంత్రి కృష్ణా రావు బీర్ల కంపెనీకి నీళ్లు ఇవ్వాలని అంటారు. కానీ రైతుల గురించి పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు.ఒకటి రెండు రోజులలో నార్లపూర్ పంపు ఆన్ చేయకపోతే కార్యాచరణకు పూనుకొని రైతులకు అండగా నిలుస్తామని హెచ్చరించారు.కేసీఆర్ హయాంలో నార్లపూర్ రిజర్వాయర్ పంపు హౌస్ సిద్ధం చేసి 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5 మోటార్లు సిద్ధం చేసి , ఒక పంపు ఆన్ చేసి రిజర్వాయర్ నుంచి నీళ్లు ట్రయల్ రన్ ద్వారా విడుదల చేశారని ఆరోపించారు.శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల ద్వారా224 టీఎంసీలు, నల్లమల ద్వారా వచ్చే నీళ్లతో పాటు మొత్తం 244 టీఎంసీ నీళ్లు వచ్చి చేరాయని వెల్లడించారు. ఇందులో 50 టీఎంసీలు విద్యుత్తు ఉత్పత్తికి సరిపోగా, మిగతా 180 టీఎంసీల నీళ్లు వాడుకోకుండా ఆంధ్రాకు ధారాదత్తం చేశారని మండిపడ్డారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ 5 పంపుల్లో ఒక్క పంపు మంచినీటికి నడిచినా, మిగతా రెండు పంపులు ఎందుకు నడుప్తలేరో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డితో జిల్లాకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. మంత్రులకు బీర్ల కంపెనీకి నీళ్లు ఇచ్చే ద్యాస తప్పా రైతుల పట్ల సోయి లేదని నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.ఇప్పటికైనా కల్వకుర్తి 3 పంపులు 24గంటలు నిర్విరామంగా నడపాలని, నార్లపూర్ ఒక పంపు నడిపి రైతులను ఆదుకోవాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఓట్ల తొలగింపుపై ఈసీపై మేఘారెడ్డి ఫైర్

వనపర్తిలో 35 వేలకుపైగాతొలగించారని ఆరోపణ



టి మీడియా , అక్టోబర్ 12 వనపర్తి : ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అఖిలపక్ష నేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనపర్తి నియోజకవర్గంలో సుమారు 2.75 లక్షల మంది ఓటర్లు ఉండగా.. 35 వేలకుపైగా ఓట్లను తొలగించారని మేఘారెడ్డి ఆరోపించారు. సర్ ప్రక్రియపై పారదర్శకత పాటించాలని, అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని కోరారు. సర్ లో పేర్లు గల్లంతైన అర్హులైన ఓటర్లను గుర్తించి తిరిగి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం అన్ని పార్టీలను కలుపుకొని దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ప్రకటించారు. సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం, తెలంగాణ జన సమితి నాయకులు పాల్గొన్నారు.

గుడి గుమ్మం వద్ద చెత్త కుప్పలు

- పంచాయతీ గుమ్మంలో పాగ కష్టాలు!



టి మీడియా , అక్టోబర్ 12 శ్రీరంగాపూర్: వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయప్రవేశ ద్వారం, వంతెన సమీపంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చెత్తను పేరబెట్టి తగలబెడుతున్న ఘటనపై భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ దర్శనానికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే భక్తులకు, గ్రామస్తులకు చెత్త నుంచి వెలువడే పొగతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. మ్యాప్‌లు చూడండిఆలయ పరిసరాల్లోనే చెత్త కుప్పలు దర్శనమివ్వడం వల్ల గ్రామంపై భక్తుల్లో చెడు అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పవిత్రతను, పరిసరాల పరిశుభ్రతను కాపాడేలా వెంటనే అక్కడి చెత్తను తొలగించి, గ్రామపంచాయతీకి కేటాయించిన చెత్త నిర్వహణ ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. ఇకపై ఆలయ ప్రవేశ ద్వారం, వంతెన పరిసరాల్లో చెత్త వేయకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువకుడి మృతిపై మిస్టరీ



టి మీడియా , అక్టోబర్ 12,కరకగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం కలవలనాగారంలో బరావత్ రవిచంద్ర అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. యువకుడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు (×అజవర్అస్త్రఘ్అశీఅ) చేపట్టినట్లు తెలిసింది. యువకుడి మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పోలీసుల విచారణ పూర్తయిన అనంతరం మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

అయ్యప్పస్వామి లతో మారు మోగిన ఆలయం

టీ మీడియా, అక్టోబర్ 12 పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో సోమవారం ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురు స్వాముల సమక్షంలో అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో మాలలు ధరించారు వేకువ జాము నుండే స్వామి వారికి పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు అయ్యప్ప స్వామి మాలలో మండలకాలం దీక్ష అనగా (48)రోజుల కఠినమైన నియమ నిబంధనలతో పాటు చన్నీటి స్నానం ఒక్కపూట భోజనం చాప మీద పడుకోవడం లాంటి నియమాలు పాటించాల్సి వుంటాయని గురు స్వాములు అన్నారు స్వామియే శరణం అయ్యప్ప అనే నామంతో ఆలయ పరిసరాలు మారు మోగాయి.



పాలిటెక్నిక్ హాస్టల్‌లో విద్యార్థినుల అస్వస్థత

పరామర్శించిన మున్సిపల్ చైర్మన్



టి మీడియా , అక్టోబర్ 12 , పెబ్బేరు: వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన కలకలం రేపింది. బుధవారం రాత్రి హాస్టల్‌లో చికెన్ తిన్న అనంతరం సుమారు 40 నుంచి 50 మంది విద్యార్థినులు అనారోగ్యానికి గురైనట్లు సమాచారం.అస్వస్థతకు గురైన విద్యార్థినులను హాస్టల్ సిబ్బంది పెబ్బేరు పీహెచ్‌సీకి తరలించి వైద్య పరీక్షలు చేయించినట్లు తెలుస్తోంది.అయితే ఫుడ్ పాయిజన్ కారణంగా కాకుండా వైరల్ ఫీవర్‌తోనే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని హాస్టల్ నిర్వాహకులు చెబుతున్నట్లు సమాచారం. హాస్టల్‌లో హెల్త్ క్యాంప్ నిర్వహించి 22 మంది విద్యార్థినులకు వైరల్ ఫీవర్ ఉన్నట్లు గుర్తించామని వార్డెన్ పేర్కొన్నట్లు తెలుస్తోంది.అయితే హెల్త్ క్యాంప్ నిర్వహించిన విషయం తనకు తెలియదని కళాశాల ప్రిన్సిపల్ చెప్పినట్లు సమాచారం.దీంతో విద్యార్థినుల అస్వస్థతకు కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

పరామర్శించిన మున్సిపల్ చైర్మన్:

విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ దయాకర్ రెడ్డి తదితరులు కళాశాలను సందర్శించి విద్యార్థినులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఓ విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురై కాళ్లు, చేతులు పనిచేయడం లేదని బాధపడుతుండగా, అక్కడే ఉన్న టీవీ5 రిపోర్టర్ విజయ్ స్పందించి ఆమెను కిందికి తీసుకొచ్చారు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మున్సిపల్ చైర్మన్ కారులో ఆమెను పెబ్బేరు పీహెచ్‌సీకి తరలించారు.అనంతరం 108 అంబులెన్స్ ద్వారా పలువురు విద్యార్థినులను పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.విద్యార్థినుల అస్వస్థతకు అసలు కారణం వైద్య పరీక్షలు, అధికారుల విచారణ అనంతరం స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఘటనపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

సీఈవో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- సిఐటియు ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం



టి మీడియా , అక్టోబర్ 12 పాల్వంచ: ఓట్ల దొంగ జ్ఞానేష్ కుమార్ రాజీనామాచేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాల్వంచ అల్లూరి సెంటర్లో జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సర్ ప్రక్రియ ద్వారా దొంగిలించారని తద్వారా బిజెపి అధికారంలోకి రావడం కోసం రాజ్యాంగబద్ధమైన సంస్థను, రాజ్యాంగ హక్కులను దుర్వినియోగం చేశాడని ఇందుకుగాను సిఇసి బాధ్యతలు నుండి వైదొలగాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఈ మధు డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యకు వ్యవస్థకు పునాది అని పేర్కొన్నారు. ఓటు హక్కును తొలగించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల కమిషన్ హత్య చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఫారం 7 ను బిజెపి నేతలు దుర్వినియోగం చేసుకునేందుకు సీఈసీ అవకాశం కల్పిస్తున్నారని తద్వారా అర్హత కలిగిన ఓటర్లను సైతం అక్రమంగా తొలగిస్తున్నారని సిఐటియు పేర్కున్నారు. బెంగాల్ ,బీహార్ రాష్ట్రాల్లో ఎన్నికల ముందు తొలగించబడిన ఓట్లల్లో 97% ఓట్లు సరైనవని అర్హత ఉన్న ఓట్లేనని వాటిని తిరిగి ఓ టర్ల జాబితాలో చేర్చాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. సర్ ప్రక్రియ అవకతవకలకు ఎన్నికల కమిషన్ సీఈసీ అవినీతి పరాకాష్టకు నిదర్శనంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే బ్రహ్మచారి, కోశాధికారి ఏజె రమేష్, జిల్లా నాయకులు దొడ్డ రవికుమార్ ఈసం వెంకటమ్మ, పిట్టల అర్జున్ ,కే సత్య తదితరులు పాల్గొన్నారు.

కరెంటు, సాగునీరు వెంటనే అందించాలి

- ఎండిపోతున్న పంటలు



టి మీడియా , అక్టోబర్ 12 హుజురాబాద్: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని నిపుణులు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో రైతులుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, రాజపల్లి సర్పంచ్ కటుకూరి మల్లారెడ్డి, కౌన్సిలర్ వర్ధినేని రవీందర్ రావు విమర్శించారు.సాగునీరు అందించేలా కృషి చేయాలని ఎంపీడీవోకి ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సాగునీరు అందక చేతికొచ్చే దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఎండీ ఆయకట్టుకు, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రాజకీయ కారణాలతో రైతులకు అన్యాయం చేయకుండా కనీసం ఒక్క తడి నీరందించి పంటలను కాపాడాలని కోరారు. అలాగే వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రెప్పపాటు కూడా విద్యుత్ అంతరాయం కలగకుండా సరఫరా చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

కన్నీటి మడుగులా కల్వల ప్రాజెక్ట్

-వృథాగా జారిపోతున్న చెరువు నీళ్లు



టి మీడియా , అక్టోబర్ 12 శంకరపట్నం: ఒకప్పుడు శంకరపట్నం, వీణవంక మండలాల పచ్చని పొలాలకు జీవనాడిలా భాసిల్లిన కల్వల ప్రాజెక్టు నేడు అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఉదాసీనత వల్ల తీవ్ర నిరాదరణకు గురవుతోంది. మూడేళ్ల క్రితం ప్రాజెక్టు మత్తడి వద్ద పడిన గండి నేటికీ పూర్తిస్థాయి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో వర్షపు నీరు వచ్చినా వచ్చినట్లే వృథాగా బయటకు పోతోంది. నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం కోల్పోయి ప్రాజెక్టు బాటలు ఖాళీగా దర్శనమిస్తుండటంతో, వానాకాలం సాగు సీజన్ మొదలైనా ఆయకట్టు రైతులు, మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూలై 28, 2023న కురిసిన భారీ వర్షాల ధాటికి మొదటగా కల్వల ప్రాజెక్టు మత్తడి వద్ద గండి పడి, కోతకు గురైంది.

తాత్కాలిక చర్యలు..

అప్పట్లో అధికారులు రింగ్‌బండ్ వేసి తాత్కాలికంగా మరమ్మతులు పూర్తిచేశారు. అనంతరం మరోసారి గండి పడింది. గత ఏడాది సాగు అవసరాల సమయంలో ప్రాజెక్టుకు మళ్లీ గండి పడటంతో, ఒక్క చుక్క నీరు కూడా నిలవకుండా ప్రాజెక్టు పూర్తిగా ఖాళీ అయింది.

రైతుల శ్రమ వృథా..

నీళ్లు నిలిచే పరిస్థితి లేకపోవడంతో, ఆయకట్టు రైతులే స్వయంగా పూనుకొని ట్రాక్టర్ల ద్వారా ఇసుక బస్తాలు అడ్డుగా వేసి తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ, వరద ఒత్తిడికి ఫలితం లేకుండా పోయింది.

12వందల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం

ప్రాజెక్టులో నీటి నిల్వ లేకపోవడంతో శంకరపట్నం, వీణవంక మండలాల పరిధిలోని దాదాపు 1,200 ఎకరాల ఆయకట్టు రైతాంగానికి సాగు నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. అలాగే ప్రాజెక్టుపై ఆధారపడి జీవనోపాధిని పొందుతున్న మత్స్యకారుల కుటుంబాలు ఉపాధిని కోల్పోతుండగా, మరోవైపు ప్రాజెక్టు దిగువన ఉన్న 5 చెక్‌డ్యామ్‌లకు నీటి ఊట లేక అవి కూడా ఎండిపోవడంతో, ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. ఫలితంగా భవిష్యత్ పంటల సాగుపై తీవ్ర సందేహాలు నెలకొన్నాయి.ప్రాజెక్టు ఎండిపోవడాన్ని అదనపు అవకాశంగా మలుచుకున్న కొంతమంది అక్రమార్కులు, ప్రాజెక్టు శిఖం (ముంపు) భూములను ఆక్రమించేందుకు పూనుకుంటున్నారు. గడిచిన రెండేళ్లుగా కొంతమంది ఇష్టారీతిన ట్రాక్టర్లతో ప్రాజెక్టు భూములను చదును చేస్తూ అక్రమంగా సాగు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.ఇటీవల గద్దపాక గ్రామానికి చెందిన కొందరు రైతులు ట్రాక్టర్లతో ప్రాజెక్టు శిఖంలో చదును చేస్తుండగా, సమాచారం అందుకున్న ఎస్సారెస్పీ నీటిపారుదల శాఖ అధికారులు అక్కడికి చేరుకొని పనులను అడ్డుకుని, ట్రాక్టర్లను వెనక్కి పంపించివేశారు.

పత్తి కొనుగోళ్లకు శ్రీకారం

• క్వింటాల్‌కు రూ.9,100 చెల్లింపు



టి మీడియా , అక్టోబర్ 12 ,కుభీర్ : నిర్మల్ జిల్లా కుభీర్మండల కేంద్రంలోని నాగేష్ పత్తి మిల్లులో సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లుప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మిల్లులో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పత్తి కొనుగోళ్లను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత పత్తిని తీసుకువచ్చిన వాహనాలకు, పత్తి తూకం వేసే యంత్రాలకు పూజలు నిర్వహించి, పత్తి కొనుగోళ్ల సీజన్ రైతులకు, వ్యాపారులకు లాభదాయకంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పత్తి విక్రయించేందుకు మిల్లుకు వచ్చిన పలువురు రైతులను వ్యాపారులు శాలువాలతో సత్కరించారు. కొనుగోలు చేసిన పత్తికి క్వింటాల్‌కు రూ.9,100 చొప్పున ధర చెల్లించినట్లు మిల్లు యజమానులు వెల్లడించారు. పత్తి నాణ్యత, తేమ శాతం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పేర్కొన్నారు.అనంతరం మిల్లు నిర్వాహకులు రెడ్డిశెట్టి సంతోష్, ఆనంద్ ఆధ్వర్యంలో అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోనే కళ్యాణ్, సర్పంచ్ కందూరి సాయినాథ్, ఏఎంసీ కార్యదర్శి, పీఏసీఎస్ సీఈవో ఎగ్గం క్రాంతికుమార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు తోకల మారుతి, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సమస్యలపై వినతి పత్రం

• సర్పంచ్ బానోతు సదర్ లాల్



టీ మీడియా, అక్టోబర్ 12, అశ్వాపురం: అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు సంబంధించి నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ, సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణిలో సర్పంచ్ బానోతు సదర్ లాల్ ఎంపీడీఓ ముత్యాలరావు కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అశ్వాపురంలోని ఆర్ అండ్ బి కార్యాలయం నుంచి మేడ నరసింహారావు ఇంటి వరకు సుమారు మూడు వందల మీటర్ల మేర నూతన మిషన్ భగీరథ పైపులైన్ వేయాల్సి ఉందని తెలిపారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు, అదేవిధంగా మంచికంటినగర్‌లో నూతన పైపులైన్ వేసిన పదిహేను రోజులకే గేట్ వాల్వ్ వద్ద వాషర్ దెబ్బతినడంతో నీరు లీకై వృథాగా పోతున్నదని, ఇస్లావత్ నాగ చేను సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బతిన్నదని వివరించారు. ఈ సమస్యలను కూడా పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ పనులు కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు.ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించాల్సిన బాధ్యతను దృష్టిలో ఉంచుకొని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని, నీటి లీకేజీలను అరికట్టి దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సర్పంచ్ బానోతు సదర్ లాల్ సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

ఫారంలు అందజేసిన బా జ పా



టీ మీడియా, అక్టోబర్ 12 ,పెబ్బేరు: వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ రంగారెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పట్టభద్రుల ఎం ఎల్ సి ఎన్నికల నేపథ్యంలో పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతికుమార్ నాయుడు నేతృత్వంలో ఓటరు నమోదు ప్రక్రియ కోసం ఫామ్ లు అందిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రాజు జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ జిల్లా కౌన్సిల్ మెంబర్ సురగౌని రంగస్వామి గౌడ్ ఎం ఎల్ సి ఎన్నికల పెబ్బేరు మున్సిపల్ కన్వీనర్ చింతల రామకృష్ణ యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండ్రాతి రాకేష్ గౌడ్ పాల్గొన్నారు తది తరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమీషనర్ రాజీనామా చేయాలి : సిపీఎం



టీ మీడియా, అక్టోబర్ 12, పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో సిపిఎం పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలని కోరుతూ శాంతియుతంగా అక్టోబర్ 10న పోరాడుతున్న సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అఖిలభారత నాయకులు సిపిఎం ఎంపీలు నాయకులు విద్యార్థి యువజన సంఘాల నాయకులు అటు రాజధాని న్యూఢిల్లీలో పోలీసుల దాడులను నిర్బంధ చర్యలను అక్రమ అరెస్టులను ఖండిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సుభాష్ చౌరస్తాలో నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు సిపిఎం మాజీ ఎంపీటీసీ జి బాలయ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం బిజెపి ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరుగుతుందని ఇది ప్రజాస్వామ్యానికే విరుద్ధమని అన్నారు నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఎన్నికల అధికారులు ఒక పార్టీకి ఏజెంట్ గా మారడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమని విమర్శించారు తక్షణం జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని తొలగించిన 13 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని ఎస్ ఐ ఆర్ లు రద్దు చేయాలని సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులు నిర్బంధాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గంధం రత్నయ్య ఆంజనేయులు జయరాములు పెద్దమన్నెం వెంకటేష్ రాజు మహేష్ మహేందర్ రామస్వామి పాల్గొనడం జరిగినది

నాదెండ్ల కొత్త ఎస్సైగా కట్టా వెంకటయ్య బాధ్యత లు

టీ మీడియా,అక్టోబర్12, నాదెండ్ల :మండల పోలీస్ స్టేషన్‌కు కొత్త సారథిగా కట్టా వెంకటయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు.జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహల్లి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు.ఇప్పటి వరకు నరసరావుపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా సేవలందించిన వెంకటయ్యను నాదెండ్లకు బదిలీ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.ఇంతవరకు నాదెండ్ల ఎస్సైగా పనిచేసిన రమణాల వెంకటేశ్వరరావును మాచర్ల రూరల్ ఎస్సైగా బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు.నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కట్టా వెంకటయ్యకు పోలీస్ స్టేషన్ సిబ్బంది సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను పటిష్టంగాకాపాడటానికి, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ రక్షణ కల్పించడానికి తమ సిబ్బందితో కలిసి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని పేర్కొన్నారు.కాగా కట్టా వెంకటయ్య గతంలో తాడేపల్లి, తుళ్లూరు,నల్లపాడు వంటి పలు కీలక పోలీస్ స్టేషన్ల పరిధిలో పనిచేసిన అనుభవం కలిగి ఉన్నారు.



గుంతలమయంగా కారేపల్లి ఇల్లెందు ప్రధాన రహదారి

• దసరా కు వెళ్లే భక్తులకు ఇబ్బందులు

టీ మీడియా,అక్టోబర్12,సింగరేణి(కారేపల్లి):ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రం కారేపల్లి నుంచి ఇల్లెందు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది.కారేపల్లి పోలీస్ స్టేషన్ నుంచి 2కేకే రైల్వే గేట్ సమీపం వరకు పలుచోట్ల రహదారిపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన మార్గం కావడంతో రహదారిని త్వరగా మరమ్మతు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.దసరా





పండుగ సందర్భంగా కోట మైసమ్మ తల్లి ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు.వారిలో అధిక సంఖ్యలో భక్తులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగించనున్నారు.ఉత్సవాల సమయంలో వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో గుంతలతో భక్తులు,ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు.ప్రధాన రహదారి అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు.దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఆర్ అండ్ బీ అధికారులు తక్షణమే స్పందించి పోలీస్ స్టేషన్ నుంచి రైల్వే గేట్ వరకు దెబ్బతిన్న రహదారిపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు అవసరం

• మాణిక్యారంలో ఐద్వా బతుకమ్మ సంబరాలు

టీ మీడియా,అక్టోబర్12,సింగరేణి(కారేపల్లి):ఆడపిల్లలకు స్వేచ్ఛ,సమానత్వంతో పాటు మహిళలకు భద్రత కల్పించే సమాజం కోసం మహిళలంతా ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి పిలుపునిచ్చారు.సోమవారం సింగరేణి మండలం మాణిక్యారం గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలవడంతో పాటు మహిళల ఆత్మగౌరవాన్ని చాటే పండుగ అని పేర్కొన్నారు.“ఆడపిల్లను పుట్టనిద్దాం.. చదవనిద్దాం.. పెరగనిద్దాం” అనే నినాదంతో ఆడపిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.మహిళలు,బాలికలపై జరుగుతున్న దాడులు,అత్యాచారాలు,వివక్షకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.మహిళలపై దాడులను అరికట్టేందుకు అమల్లో ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయడంతో పాటు వారి రక్షణకు ప్రభుత్వాలు సమర్థవంతమైన



చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.విద్య,వైద్యం,ఉద్యోగ,ఉపాధి రంగాలతో పాటు చట్టసభల్లోనూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు.అనంతరం గ్రామ కూడలిలో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు.సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ ఆడి పాడారు.ఈ కార్యక్రమంలో పోతర్ల సునీత,అజ్మీర జ్యోతి,బుసరాజు నాగమణి,మేకల స్వరూప, గడ్డిబోయిన సుభద్ర,వేపాకుల సుగుణమ్మ,సాయమ్మ,వీరమ్మ,పద్మ,రమ్య,సింధు,భవాని,పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.